క్లుప్తంగా

అనుమానాస్పద సమాచారం ఇవ్వండి

● రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: నివాసిత ప్రాంతాల్లో ఉన్న వీధుల్లో కానీ, గ్రామాల్లో కానీ ఎక్కడైనా ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తున్నట్లు అనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి కోరారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో జరిగిన చోరీ దృష్ట్యా కొంతమంది దుండగులు చోరీలకు పాల్పడేందుకు సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే గృహ సముదాయాలు, వీధుల్లో, పరస్పర సహకారంతో నిఘా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేస్తున్న మంత్రి సంధ్యారాణి తదితరులు

సాలూరు: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని స్త్రీశిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమ సన్నాహకాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి జీవనంలో యోగాకు ప్రత్యేక స్థానముందంటూ యోగా ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా యోగసనాలు, మానవహారాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త తరలించే ట్రాక్టర్



సచివాలయం వెనుకభాగంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

పార్వతీపురం రూరల్: మండలంలోని పెద బొండపల్లి గ్రామానికి చెత్తను తరలించేందుకు రెండేళ్ల క్రితం మంచి గత ప్రభుత్వం ట్రాక్టర్‌ను కేటాయించింది. అయితే అధికారుల నిర్లక్ష్యమో? పాలకుల అలసత్వమో కానీ లక్షలాది రూపాయల విలువైన ట్రాక్టర్‌ను రెండేళ్లుగా నిరుపయోగంగా సచివాలయం భవనం వెనుకభాగంలో ఉంచడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధిత పంచాయతీ అధికారులు సమాధానమిస్తూ ట్రాక్టర్‌కు వెనుకభాగంలో ఉండే తొట్టె మంజూరు కాకపోవడంతో ఈ విధంగా ఉంచినట్లు చెబుతున్నారు. అయితే ఈ సమస్యను పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారా? లేదా ప్రాథమిక స్థాయిలోనే నిర్లక్ష్యం వహించారా? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని రాజమండ్రికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త విశ్వనాథరెడ్డి సూచించారు. మండలంలోని విక్రమపురంలో శనివారం నిర్వహించిన ప్రకృతి సేద్యంపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునిక ప్రపంచంలో పని సులభతరంతో పాటు తక్కువ కాలంలో అల్ప పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలన్నారు.


భక్తి శ్రద్ధలతో బక్రీద్



జామియా మసీదులో సమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

పార్వతీపురం టౌన్:

ముస్లింలు అతి పవిత్రంగా భావించే బక్రీద్ పండగను పట్టణంలో శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ముస్లిం సోదరులు నూతన దుస్తులు ధరించి పట్టణంలో గల జామియా మసీదులో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ త్యాగాలకు మారుపేరుగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. బక్రీద్ వేడుకలు ప్రజల మధ్య శాంతి సామరస్యాన్ని, సోదర భావాన్ని పెంచుతాయన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బక్రీద్ సందర్భంగా మసీదుల వద్ద పోలీసు సిబ్బంది

మసీదుల వద్ద బందోబస్తు

పార్వతీపురం రూరల్: జిల్లాలో శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదుల్లో ఎటువంటి మత ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మసీదుల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు సంబంధిత మసీదుల పరిధిలో ఉన్న పోలీసు సిబ్బంది పర్యవేక్షించి నమాజ్‌లకు వచ్చిన ముస్లిం సోదరులకు ఎటువంటి అంతరాయం, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పుస్తకాలను చూపిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, తదితరులు

పార్వతీపురం రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విక్రయిస్తున్న పుస్తకాలను సీజ్ చేసి ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మండల పరిధిలో ఉన్న వసుంధర నగర్ వద్ద ఒక గదిలో జిల్లా కేంద్రంలోని రెండు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలను విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను పటిష్టం చేయాల్సిన సంబంధిత విద్యాశాఖ అధికారులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ కళ్లముందు నిబంధనలకు తూట్లు పొడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా వేలాది రూపాయల్లో పుస్తకాలను అమ్మకాలు చేస్తున్న యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకుని ఆ పుస్తకాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దుర్గ, వికాస్, చరణ్, భూషణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రార్థించారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో గల వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో రాజన్నదొర శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని రాజన్నదొర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్‌లు, నాయకులు గిరిరఘు, హరిబాలాజీజి ,టెక్కలి ధర్మారావు, కొంకి అప్పారావు, మాదిరెడ్డి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పశువుల ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: తొలకరి కాలం రావడం వల్ల పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు పశువైద్యాధికార సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక పశువైద్య కేంద్రంలో బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారులు డాక్టర్ ఎస్.రామారావు, బి.గణేష్‌ల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జూనియర్ వెటర్నరీ వైద్యాధికారులు, వీఎస్ఏలు, పశుసంవర్ధక సహాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు తొలకరి కాలంలో జీర్ణకోశ వ్యాధులు, నోటి సంచలు, కాళ్ల సంచలు, జ్వరం వస్తాయని తెలియజేశారు. వ్యాధుల నివారణకు అవసరమైన వ్యాధి నిరోధక వ్యాక్సిన్‌లు, సూది మందులు వేయాలని సూచించారు. అలాగే పాడిపశువులకు ఆడదూడలు పుట్టడానికి ట్రిబుల్ ఎస్ సెమ్ ఇంజక్షన్లు వేయనున్నట్లు తెలిపారు. పాడి రైతులు పశువులు జతకు వచ్చినట్లు గుర్తించి సమీపంలో ఉన్న పశువైద్య కేంద్రానికి తరలించి ట్రిబుల్‌సెం ఇంజక్షన్లు వేయించాలని సూచించారు.

నాణ్యత లేని ఆహారంతో రోగుల అవస్థలు

● సీపీఎం నాయకుడి ధ్వజం



రోగులకు అందించేందుకు సిద్ధంగా ఉన్న నాణ్యత లేని ఆహార పదార్థాలు, సగానికి పైగా చెడిపోయిన అరటిపండ్లు

పార్వతీపురం: జిల్లా కేంద్రాస్పత్రిలో రోగులకు అందించే ఆహారం నాణ్యతా లోపంతో ఉందని సీపీఎం నాయకుడు పి.రాము ఆరోపించారు. ఆస్పత్రిలో రోగులను పరామర్శించేందుకు శనివారం వెళ్లిన ఆయన అక్కడ రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో వచ్చే రోగులకు శుచి, శుభ్రతతో కూడిన ఆహార పదార్థాలను అందించాల్సి ఉన్నప్పటికీ నిర్వాహకులు నాణ్యత లేని నాసిరకం వస్తువులతో వంటకాలు చేసి ఆహారాన్ని రోగులకు అందిస్తున్నారని అదికూడా సక్రమంగా సరిపడా కొలమానంలో ఇవ్వకుండా అరకొరగా సరఫరా చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే మెనూ ప్రకారం అందించాల్సిన పండ్లు కూడా సగానికి సగం పాడైనవే అందిస్తున్నారన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు కానీ జిల్లా అధికారులు కానీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని కోరారు. రోగులకు నాణ్యతా ప్రమాణాలకు లోబడి భోజనాన్ని అందించకపోతే ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు బాగు చేయండి



ఆందోళన చేస్తున్న దశుమంతపురం గ్రామస్తులు

వీరఘట్టం: జియ్యమ్మవలస, వీరఘట్టం మండలాల్లోని దశుమంతుపురం–పెద్దబుడ్డిడి గ్రామాల మధ్యన ఉన్న రోడ్డు బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు వాకాడ ఇందిర, నాయకుడు ఎస్.సింహాచలం ఆధ్వర్యంలో శనివారం దశుమంతపురం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల తీవ్ర అవస్థలు పడుతున్నామని, ఆ దారిలో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేదని, కనీసం రోడ్డు మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

● సీపీఎం డిమాండ్

సీతానగరం: ప్రభుత్వం ఏనుగుల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు రెడ్డి వేణు అన్నారు. బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రెండు రోజులుగా ఏనుగుల గుంపు సంచరిస్తున్న విషయం విదితమే. ఇదివరలోనే ఏనుగుల గుంపు ప్రవేశించి పంటలు నాశనం చేశాయని, పంటలు నష్టపోయిన రైతులకు నేటికీ నష్ట పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. మూడు నెలల క్రితం అప్పయ్యపేట వద్ద ఏనుగుల జోన్ ఏర్పాటు చేసి ఏనుగులను సంరక్షిస్తామని అటవీశాఖ అధికారులు పనులు ప్రారంభిస్తే సీపీఎం అడ్డుకుందన్నారు. అటవీ శాఖ అధికారులు గిరిజన దళిత రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా వారి భూములకు పట్టాలు ఇప్పిస్తామని, మూడు ఎకరాల పరిధిలో కుంకి ఏనుగులను తీసుకువచ్చి వాటి ద్వారా మచ్చిక చేయించి ఏనుగుల సంరక్షణ ఆపైన ఏనుగులు ఎక్కడ నుంచి వచ్చాయో అక్కడికే తరలిస్తామని హామీ ఇచ్చారన్నారు. కుంకి ఏనుగులు రాలేదు, కానీ ఇప్పుడు ఒడిశా నుంచి తప్పిపోయిన ఏనుగులను అప్పయ్యపేట గ్రామానికి తరలిస్తున్నట్లు తెలియజేశారు.

మండల ప్రజలకు ప్రాణ, ఆస్తి, పంటనష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అటవీ శాఖ అధికారులు, ప్రభుత్వం ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, చందనపల్లి కృష్ణ, వై.రామారావు పాల్గొన్నారు.

వెంకటాపురం–బూర్జ మధ్య ఏనుగుల సంచారం





వెంకటాపురం–బూర్జ పొలాల్లో ఏనుగుల గుంపు

సీతానగరం:

మండలంలోని బూర్జ–వెంకటాపురం గ్రామాల మధ్య పంటపొలాలు, తోటల్లో శనివారం ఏనుగులు సంచరిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం గరుగుబిల్లి మండలంలోని చినగుడబ నుంచి సుమిత్రాపురం పొలాల్లోంచి కృష్ణారాయపురం, బూర్జ పొలాలవరకూ సంచరించాయి. శనివారం వెంకటాపురం–బూర్జ తోటల్లో సంచరిస్తున్నాయి. ఏనుగుల గుంపు ఆచూకీని ప్రజలకు తెలియ జేసి వారిని చైతన్య పర్చడానికి ట్రాకర్స్ ఏనుగుల గుంపుతోనే ఉంటున్నారు. ఈ విషయమై అటవీశాఖ గుచ్చిమి బీట్ ఆఫీసర్ సతీష్ మాట్లాడుతూ చినగుడబ నుంచి యాదృచ్ఛికంగా ఏనుగుల గుంపు బూర్జ వరకూ వచ్చిందన్నారు. జోగింపేట జోన్‌కు వాటిని తరలించడం తన పరిధిలో లేదని, రెవెన్యూ, సివిల్ పోలీస్, అటవీశాఖ అధికారుల సమక్షంలో జోన్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. ఏనుగు పిల్లలతోపాటు 8 ఏనుగుల గుంపు . పగటిపూట తోటల్లో ఉంటూ రాత్రి వేళ పొలాల్లో సంచరిస్తున్నాయని తెలియజేశారు.

పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: కుల, మత, పార్టీల భేదం, తారతమ్యాలు లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమాన్ని ఏ విధంగా ప్రతి ఇంటికి ఇచ్చారో అలాగే పార్టీని నమ్ముకున్న వారికి మరింత ప్రాధాన్యం ఇచ్చి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని కోరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స చంటి మామయ్య పూడి మన్మథరావు ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న జోగారావు స్థానిక నాయకులతో కలిసి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల పలు సందర్భాల్లో పార్టీని నమ్ముకుని ఉన్న వారికి ఏ విధంగా అండగా ఉంటారో స్పష్టం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైఎస్ ఎంపీపీ బంకురు రవికుమార్, స్థానిక సర్పంచ్ ఎస్.శ్రీరాములు నాయుడు, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు తిరుపతిరావు, వాసుదేవరావు తదితరులు ఉన్నారు.



బొత్స చంటి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

వెబ్ వద్దు–మాన్యువలే ముద్దు

● ఎస్జీటీల నిరసన

బలిజిపేట: ఎస్జీటీలకు (సెకెండరీ గ్రేడ్ టీచర్స్) బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్‌గానే నిర్వహిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్జీటీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేట ఎంఆర్సీ వద్ద ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు శనివారం నిరసన నిర్వహించి ఎంఆర్సీ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్జీటీల కౌన్సెలింగ్‌ను మాన్యువల్ విధానంలోనే నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి దానికి విరుద్ధంగా ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్‌ను ప్రవేశపెట్టి వెబ్ ఆప్షన్లు పెట్టమని ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎంఆర్సీ వద్ద నిరసన నిర్వహిస్తున్నామన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తూ నిరసనలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.



ఎంఆర్సీ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్జీటీలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



సీతానగరంలో వెబ్‌కౌన్సెలింగ్‌ను నిరసిస్తూ ఎంఈఓ సూరిదేముడుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

కబ్జా కోరల్లో.. సాగునీటి చెరువులు!

● కనుమరుగువుతున్న చెరువులు
● అడ్డగోలుగా ఆక్రమణలు, గ్రావెల్ తవ్వకాలు
● తగ్గుతున్న నీటివనరుల విస్తీర్ణం
● పట్టించుకోని అధికార యంత్రాంగం

జియ్యమ్మవలస:

కబ్జా కోరల్లో చిక్కుకుని చెరువులు కనుమరుగవుతున్నాయి. అక్రమార్కులు తమ ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు, ఆక్రమణలు చేసేస్తుండడంతో రానురాను కోనేరుల విస్తీర్ణం తగ్గుతోంది. వేసవిలో నీటిఎద్దడి తీర్చే చెరువుల అవసరం.. కుళాయిలు వచ్చిన తర్వాత కాస్త తగ్గింది. ప్రస్తుతం మూగజీవాల దాహార్తి, స్నానం, పంటల సాగుకు మాత్రమే పరిమితమైంది. ఏటా ఎండాకాలంలో చెరువులు ఎండిపోయి ఖాళీగా కనిపిస్తుండడడంతో కబ్జాదారులు వాటిపై కన్నేస్తున్నారు. అడిగే నాథుడే లేకపోవడంతో ఎవరికి వారు నచ్చినట్లు నచ్చినంత దోచేసుకుంటున్నారు. ఏం చక్కా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే కొంతమంది చెరువు మన్నును తరలించుకుపోతుండగా, మరికొంతమంది చెరువు భాగాన్ని దగ్గరలోని తమ భూమిలో కలిపేసుకుంటున్నారు. ఫలితంగా వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే చెరువు నీటితో నిండిపోవడం, వరదనీరు గట్టుపై ప్రవహించడం తద్వారా గట్టు కొట్టేయడం వంటివి జరుగుతున్నాయి. ఇలా గతంలో జరిగిన చాలాసార్లు రైతులు తమ పంటలను నష్టపోయేవారు. దీంతో పాటు చెరువులు ఆక్రమణకు గురవుతుండడంతో సాగునీరు సరఫరా కూడా అంతగా ఉండడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, ఆక్రమణదారుల చేతుల్లోని చెరువులను సంరక్షించాలని కోరుతున్నారు.



ఆక్రమణలో చింతబెలగాం గుడి చెరువు



పంటభూముల్లో కలిసిపోయిన పరజపాడు జగన్నాథ సాగర్

మండలంలో 194 చెరువులు..

మండల వ్యాప్తంగా మొత్తం 194 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలోని మూడు వేల ఎకరాలకు పైగా పంటభూములకు గతంలో ఈ చెరువుల ద్వారానే సాగునీరు అందేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. చెరువుల ఆక్రమణలు తొలగించి, అభివృద్ధి చేసి సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చెరువులే కాకుండా మండలంలోని చాలాచోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నాయని, ఇవన్నీ తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వర్షంతో ఉపశమనం

పాలకొండ రూరల్/భామిని: మండలాల్లోని పలుచోట్ల శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. ఉదయం ఎండ తీవ్రతకు ఉక్కపోతతో అలమటించిన ప్రజలు వర్షం కారణంగా ఏర్పడిన చల్లని వాతావరణంతోఉపశమనం పొందారు.